క్లుప్తంగా

నాయకత్వ లక్షణాలపై శిక్షణ


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

గండేపల్లి: విద్యా రంగంలో మార్పులు తీసుకు రావడంలో నాయకులు, ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఐదు రోజుల పాటు జరిగిన అకడమిక్ లీడర్‌షిప్‌పై ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారంతో ముగిసింది. విద్యా నాయకత్వ నైపుణ్యాలు, అభివృద్ధి, పాలన విధానంలో పారదర్శకత, వ్యూహాత్మక ప్రణాళిక ద్వారా సంస్థ అభివృద్ధి, బోధనలో నూతన ఆవిష్కరణలు, నాణ్యత నియంత్రణ పద్ధతులపై చెన్నై నుంచి వచ్చిన ప్రొఫెసర్లు ఎస్.రేణుక దేవి, పి.మెల్లిగ్, ఇంజినీర్ ఎం.సుతార్ సన్ శిక్షణ ఇచ్చారు. ఆధ్యాపకుల నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి చెన్నైకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్‌తో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్లు ఎస్.రమాశ్రీ, ఆదిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన


ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం బాల్య వివాహాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి ఆధ్వర్యంలో స్థానిక మందుల కాలనీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని పలు ప్రాంతాల్లో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. వేసవి సెలవుల్లో కిశోరి వికాసంలో భాగంగా పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కిషోర బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శుక్రవారం రెడ్ క్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం. శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఇళ్ల మధ్య విద్యుత్ లైన్ తొలగించాలి


చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను చూపుతున్న స్థానికులు

జగ్గంపేట: మండలంలోని కాండ్రేగుల వినాయక నగర్‌లో ఇళ్ల మధ్యలో గల 11 కేవీ విద్యుత్ తీగలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జేఎస్పీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ వద్ద వాపోయారు. విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉండటంతో గతంలో ఇర్రిపాకకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడ్డాడని తెలిపారు. ఇంటి నిర్మాణం నిమిత్తం వచ్చిన తాపీ మేస్త్రీ విద్యుత్‌షాక్‌కు గురైనట్టు వివరించారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


టి.రాయవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది

ప్రత్తిపాడు: బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరమని ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఎస్.వరలక్ష్మి అన్నారు. మండడలంలోని టి.రాయవరం గ్రామంలో శుక్రవారం కిశోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఉత్పన్నమయ్యే అనర్థాలు వివరించారు. బాల్య వివాహాలకు సహకరించే వారికి పడే కఠిన శిక్షలు, జరిమానాలు, ఫోక్సో చట్టం తదితర అంశాలను వివరించారు. అనంతరం గ్రామంలో బాల్య వివాహాలను అరికట్టాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మహిళా పోలీస్ ఎ.అనిత, ఏఎన్‌ఎం అనంతలక్ష్మి, ఆశా వర్కర్ పి.అనసూయ, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


డి.పోలవరంలో 4 యూనిట్లలో కంపోస్టు తయారీకి వేసిన వానపాములు, వ్యర్థాలు


వి.కొత్తూరులో వానపాముల్లేక ఖాళీగా దర్శనమిస్తున్న కంపోస్టు యూనిట్లు


రేఖవానిపాలెంలో అధికారులు ఇంటింటా అవగాహన కల్పన, చెత్త సేకరిస్తున్న సిబ్బంది

సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ !

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- పుష్కర కాలమైనా కానరాని ఎరువుల తయారీ, విక్రయాలు
- ఒక్కొక్క యూనిట్‌కు రూ.లక్షల్లో వ్యయం


వి.కొత్తూరులో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రం

తుని రూరల్: గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం, చెత్త నుంచి సంపద సృష్టించేందుకు ఉద్దేశించిన ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాలు వెలవెలబోతున్నాయి. పంచాయతీల్లో తడి, పొడి చెత్త సేకరించేందుకు క్లాప్ సిబ్బందిని నియమించారు. సేకరించిన చెత్తను తరలించేందుకు రూ.లక్షలు ఖర్చు చేసి రిక్షాలు, ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. పుష్కర కాలమైనా పంచాయతీలకు ఒక్కపైసా ఆదాయం సమకూరలేదు. కేంద్రాలకు, రిక్షాలు, ట్రాక్టర్లకు మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు కోట్లాది రూపాయలు వెచ్చించారు. అయినప్పటికీ స్వచ్ఛ భారత్ సంకల్పం ఎప్పుడు నెరవేరుతుందో, పంచాయతీలకు చెత్త నుంచి సంపద ఎప్పుడు లభిస్తుందోనన్న అంశం ప్రశ్నార్థకంగా ఉంది.

నియోజకవర్గంలో...

తుని నియోజకవర్గంలో 30కిపైగా చెత్త నుంచి సంపద కేంద్రాలు నిర్మించారు. ఒక్కొక్క కేంద్రానికి రూ.3.50 లక్షల నుంచి రూ.ఐదు లక్షలు వరకు ఖర్చు చేశారు. పంచాయతీ విస్తీర్ణం, జనాభాను బట్టి ఒక్కొక్క పంచాయతీకి మూడు నుంచి పది రిక్షాలు చొప్పున, మేజరు పంచాయతీలకు అదనంగా ట్రాక్టర్లను రూ.లక్షలు ఖర్చు చేసి సమకూర్చారు. నాలుగైదేళ్లగా క్లాప్ సిబ్బందికి జీతాలు చెల్లిస్తున్నారు. ఇటీవల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

కానరాని సేంద్రియ ఎరువులు, విక్రయాలు

క్లాప్ సిబ్బంది ద్వారా సేకరించిన తడి, పొడి చెత్తను ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలకు తరలించి విభజించాల్సి ఉంది. విభజన అనంతరం తడి చెత్తతో కంపోస్టు ఎరువులు తయారు చేసి సాగుదారులకు విక్రయించాల్సి ఉంది. పుష్కరకాలమైనా ఈ ప్రక్రియ జరగడం లేదు. ఉన్నత అధికారులు, ఎమ్మెల్యే, మంత్రులు పరిశీలనకు వస్తే ఆరకొరగా ప్రక్రియ చేపట్టినట్టు క్షేత్రస్థాయిలో హడావిడి చేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యటిస్తున్నా ఇప్పటి వరకు తుని నియోజకవర్గంలో ఒక్క కేంద్రంలోనూ చెత్త నుంచి సంపద లభించలేదు. సాగుదారులకు సేంద్రియ ఎరువులు చేరడం లేదు.

వినియోగానికి సిద్ధంగా 11 కేంద్రాలు

తుని మండలంలో 11 ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ సెంటర్లు వినియోగానికి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే క్లాప్ సిబ్బందికి రెండుసార్లు శిక్షణ ఇచ్చాం. తడి, పొడి చెత్తపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ క్లాప్ సిబ్బందితో చెత్త సేకరణ చేస్తున్నాం. తొట్టిల్లో వానపాములు వేసి వర్మీ కంపోస్టు తయారీకి ఏర్పాట్లు చేశాం. సేంద్రియ ఎరువులు సాగుదారులకు అందుబాటులోకి తెస్తాం. తద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుతాం. డి.పోలవరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సిబ్బంది శిక్షణ అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నాం.

– జి.మరిడియ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, తుని.

పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలి


శంఖవరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

శంఖవరం: మీడియాపై దాడులు ఆపాలని, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలని కోరుతూ శంఖవరం ప్రెస్‌క్లబ్ సభ్యులు శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. సీనియర్ జర్నలిస్టులు కేళంగి హరినాథ్, రేలంగి దొరబాబు, జక్కల సత్యనారాయణ, బొట్ల లోవరాజు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ తాతారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసులు అక్రమంగా సోదాలు చేయడం దారుణమన్నారు. పాత్రికేయులపై దాడులను తీవ్రంగా ఖండించారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు యండమూరి బాబి, పులి రాధాకృష్ణ, బైరా రామారావు, నక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డు సీజ్

ప్రత్తిపాడు: మండలంలో పోతులూరు గ్రామ పంచాయతీ రికార్డును పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) బాలామణి శుక్రవారం సాయంత్రం సీజ్ చేశారు. పోతులూరు గ్రామ పంచాయతీలో భారీగా నిధుల దుర్వినియోగం జరిగిందని గ్రామ ఉప సర్పంచ్ బర్ల చక్రం, మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు మరో 53 మంది గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో పోతులూరు గ్రామ పంచాయతీ రికార్డులు, ఎం. బుక్‌లను పరిశీలించారు. తదుపరి విచారణ నిమిత్తం పంచాయతీకి చెందిన ముఖ్య రికార్డులను డీఎల్‌పీఓ బాలామణి సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ తులాభారం


ఎస్.అన్నవరంలో శ్రీకృష్ణ, గోపిక పూజ చేస్తున్న యువతులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీకృష్ణ తులాభారం, శ్రీకృష్ణ గోపిక పూజ నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు కన్నెపిల్లలతో సామూహిక శ్రీకృష్ణ గోపిక పూజ చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల అశ్వవాహన సేవ నిర్వహించారు. శ్రీకృష్ణ తులాభారం కన్నుల పండువగా జరిగింది.

నేడు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సర్వ వ్యాధి నివారణార్థం సురదర్శన హోమం, సాయంత్రం గజ వాహన సేవ, సహస్ర దీపాలంకర సేవ, తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


రౌతులపూడి సీహెచ్‌సీలో గర్భిణులకు సూచనలు, సలహాలు ఇస్తున్న వైద్యులు

రౌతులపూడి: స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 160 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారిణి జానకీదేవి ఆధ్వర్యంలో గైనకాలజిస్టు డాక్టర్ సునీత గర్భిణులకు పరీక్షలు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు రౌతులపూడి గ్రామానికి చెందిన యెడ్ల బుజ్జి, రమణమ్మ దంపతులు సహకారంతో భోజనాలు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రిలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి


తునిలో వ్యాపార సంస్థ అధినేతకు సమ్మె నోటీసు అందిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

తుని: కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు శుక్రవారం పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్, డీ మార్టు, వైశ్యరాజు జ్యూవెల్లరీ, సీఎంఆర్ షాపింగ్‌మాల్ తదితర వ్యాపార సంస్థలకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు నక్కెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పని ప్రాంతాల్లో కార్మికులకు భద్రత కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొర్ల వెంకట రమణ, బత్తిన నాగేశ్వరరావు, వాడపర్తి పండు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన


నాయకంపల్లిలో ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న జేసీ రాహుల్ మీనా

గండేపల్లి: మండలంలోని నాయకంపల్లిలో ప్రభుత్వ భూములను జేసీ రాహుల్ మీనా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రీ సర్వేపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం


శంఖవరంలో కుట్టు మెషీన్ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

శంఖవరం: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. స్థానిక వికలాంగుల భవనంలో జిల్లా బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా తరగతులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు నెలలు పాటు కొనసాగే ఈ శిక్షణా తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీపై మిని ట్రాక్టర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ తాతారావు, ఎంఈఓ ఎస్‌వీ రమణ, కూటమి నాయకులు బద్ది రామారావు, పర్వత సురేష్, వెన్నా శివ, మేడిశెట్టి బాబి, మేకల కృష్ణ, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


సింహాద్రిపురంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈ ఉమాశంకర్

కిర్లంపూడి: రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఈ ఉమాశంకర్ సూచించారు. మండలంలోని జగపతినగరం–సింహాద్రిపురం రోడ్డు నిర్మాణ పనులను రూ.1.25 కోట్లు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టారు. కాగా శుక్రవారం బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ, జేఈ పీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బార్ అధ్యక్షుడిగా ఆరోసారి మేరుగు

పిఠాపురం: పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మేరుగు రాజారావు ఆరోసారి ఎన్నికయ్యారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్థానిక బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా సీనియర్ న్యాయవాది పిట్ల రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా గౌతు రాజు రెండో సారి ఎన్నికయ్యారు. శుక్రవారం పిఠాపురం కోర్టుల సముదాయంలో అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు నిర్వహించారు. అంతకు ముందు బార్ అసోసియేషన్ పాలక మండలిలో ఉపాధ్యక్షుడిగా ముమ్మిడి రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ముమ్మిడి శ్రీనివాస్, స్పోర్ట్స్ కార్యదర్శిగా ఎంవీవీఎన్ సత్యనారాయణ, లైబ్రరీ కార్యదర్శిగా జీఎస్ భాస్కరాచార్యులు, లేడీ రిప్రజెంటేటివ్‌గా ఎం సత్యవాణిశ్రీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సరిదే నాగేశ్వరరావు, సీహెచ్ ప్రేమ్‌జీ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రావుల రమేష్, జీవీవీ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వరివడిగా పంట ఒబ్బిడి


కోదాడలో మెషీన్‌తో వరికోతలు

- అకాల వర్షాలతో అవస్థలు
- పంట ఒబ్బిడిలో అన్నదాత బిజీబిజీ

తొండంగి: నియోజకవర్గంలో రబీ వరి పంట ఒబ్బిడి పనులు జోరుగా సాగుతున్నాయి. అడపాదడపా కురుస్తున్న అకాల వర్షాలను తప్పించుకుని రైతులు రబీ వరికోత పనులు కొనసాగిస్తున్నారు. ఉదయం నుంచి అధిక ఉష్ణోగ్రతలతో ఎండ, సాయంత్రానికి ఒక్కసారిగా వర్షం కురవడం వంటి భిన్నవాతావరణం కారణంగా పంట ఒబ్బిడికి రైతులు ఆపసోపాలు పడుతున్నారు. మండలంలోని మెట్ట ప్రాంతాల్లో వరికోతలు పూర్తయ్యాయి. ఆలస్యంగా వరినాట్లు పడిన తీరప్రాంత గ్రామాలు ఎ.కొత్తపల్లి, కోదాడ, శృంగవృక్షంపేట తదితర ప్రాంతాల్లో వరికోత పనులు కొనసాగుతున్నాయి. ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు వరిచేలల్లో నీరు చేరింది. వరికోత యంత్రాలు వినియోగించాలంటే వరిపొలం పూర్తి ఆరుదలగా ఉండాలి. సంప్రదాయ పద్ధతిలో కూలీలతో కోత కోయించి చేను ఆరబెట్టి ఎగరపోత పోసి ధాన్యం ఒబ్బిడి చేసేందుకు వాతావరణం అనుకూలించదు. దీంతో అధిక ధరలు చెల్లించి వరికోత యంత్రాలతోనే పంట కోతలు కోయిస్తున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 80 శాతం వరకూ పంట ఒబ్బిడి పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో పాటు వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రహదారులపై ధాన్యం ఆరబోత


నీలాద్రిరావుపేట వాసుదేవ నగర్‌లో రోడ్డుపై ధాన్యపు రాశులు

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట వాసుదేవనగర్‌లో రహదారులు ధాన్యపు కళ్లాలుగా దర్శనమిస్తున్నాయి. ఇళ్ల మధ్యలో గల రోడ్లపై ధాన్యాన్ని ఆరబోస్తూ రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. గత 20 రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్లపై ధాన్యం రాశులు పోయడంతో మోటార్ సైకిళ్లు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని వాసుదేవనగర్ వాసులు కోరుతున్నారు.

సైన్యం విజయం కోరుతూ ప్రత్యేక పూజలు


పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

గోకవరం: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తో చేస్తున్న యుద్ధంలో భారత సైన్యం విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ బీజేపీ మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర ఆధ్వర్యంలో గోకవరం దేవీచౌక్ ఆలయంలో శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌లో తమ ప్రాణాలు పణంగా పెట్టి ఎంతో వీరోచితంగా యుద్ధం చేస్తున్న భారతదేశ సైనికులు విజయం సాధించాలన్నారు. మొత్తం సఫలీకృతం కావడానికి భగవంతుని అనుగ్రహం కూడా తోడవ్వాలని ఆకాంక్షించారు. భారత్ చేసే యుద్ధంలో ధర్మం ఉంది కాబట్టి విజయం భారత్‌నే వరిస్తుందన్నారు. మన దేశం, మన సైన్యం, మన ప్రజలు బాగుండాలని కోరుతూ ప్రతిఒక్కరూ తమ ఇష్ట దైవాన్ని ప్రార్థించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సత్తి వెంకటరెడ్డి, నియోజకవర్గ కో కన్వీనర్ కోన సురేష్, రైల్వే బోర్డు సభ్యుడు బత్తుల వెంకన్న బాబు, ఉంగరాల ఆదివిష్ణు, బత్తుల నానాజీ, తదితరులు పాల్గొన్నారు.


గోకవరం దేవీచౌక్ ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

జవాన్లకు వందనం

తొండంగి: పాకిస్తాన్‌తో యుద్ధానికి తలపడుతున్న దేశ జవాన్లకు శుక్రవారం మండలంలోని పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో వందన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో భరత మాత చిత్రపటానికి హెచ్‌ఎం చాత్రాడ వీవీ సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. యుద్ధ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సైనిక విజయాన్ని కాంక్షిస్తూ పూజలు

గోకవరం: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌పై యుద్ధం చేస్తున్న దేశ సైనికుల విజయాన్ని కాంక్షిస్తూ సూర్యపీఠం ట్రస్టు ఆధ్వర్యంలో తొయ్యేరు ఆర్అండ్ఆర్ కాలనీలోని కోదండ రామాలయం వద్ద ఆదిత్యహృదయం స్తోత్రం పారాయణ చేశారు. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబా ఆధ్వర్యంలో శుక్రవారం ట్రస్టు సభ్యులు పూజలు, పారాయణ నిర్వహించారు. యుద్ధంలో దేశం విజయం సాధించాలని ఆకాంక్షించారు.


తొయ్యేరులో ఆదిత్య స్తోత్రం పఠిస్తున్న సూర్యపీఠం ట్రస్టు సభ్యులు

20 నుంచి విధుల బహిష్కరణ

సామర్లకోట: మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఈ నెల 20 నుంచి పూర్తి స్థాయిలో విధులు బహిష్కరిస్తున్నట్టు యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకానున్నట్టు తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈ నెల ఐదున కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చామని, అత్యవసర విభాగం దృష్ట్యా ఇన్నాళ్లు విధులు నిర్వహించామని, సమస్యలు పరిష్కరించకపోవడంతో 20వ తేదీ నుంచి పూర్తిస్థాయి సమ్మెలో పాల్గొంటామని తెలిపారు.